నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్-నిర్మల్
5 నిజామాబాద్ గురువారం 25 జూలై 2024 ADILABAD NIRMAL



మత్తడి దుంకుతున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గుండంలొద్ది చెరువు

## భారీ వర్షం

- స్తంభించిన జనజీవనం
- సగటు 32.5 మిల్లీ మీటర్లు
- ఆదిలాబాద్ అర్బన్‌లో 64.6 మిల్లీ మీటర్లు



ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, చించూఘాట్ మధ్య వంతెన మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన గుంత

ఆదిలాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా పడుతున్న వానలతో జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా చెరువులు మత్తడి దుంకుతున్నాయి. జలపాతాలు పరవళ్లు తొక్కుతుండగా ప్రాజెక్టుల్లో నీటిమట్టం పెరుగుతున్నది. రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. జిల్లాలో 32.5 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా..అత్యధికంగా ఆదిలాబాద్ అర్బన్ మండలంలో 64.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. రూరల్ మండలంలో 48.9, బేలలో 45.7, ఇంద్రవెల్లిలో 45.6, ఉట్నూర్‌లో 41.6, జైనథ్‌లో 38.8, గుడిహత్నూర్‌లో 35.3, మావలలో 32.7, బజార్‌హత్నూర్‌లో 31.3, భీంపూర్‌లో30, తాంసి లో 31, ఇచ్చోడలో 29, తలమడుగులో 21.3, నేరడిగొండలో 20.8, బోథ్‌లో 20.7 మి.మీ వర్షం పడింది.

## పారిశుధ్యంపై దృష్టి సారించాలి..



భోసి పాఠశాలలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

తానూర్, జూలై 24 : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని భోసి, బోరిగాం గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. భోసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించి పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, నాయకులు చంద్రకాంత్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, కృష్ణనంద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా



విజయ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మల్వాయ

నార్నూర్, జూలై 24 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మల్వాయ బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహారం, ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వడ్డించే తీరు, నమోదు చేసే రికార్డుల నిర్వహణను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట సీడీపీవో శారద, ఎంఈవో రాపెల్లి ఆశన్న ఉన్నారు.

## రుణమాఫీ పై బ్యాంకు అధికారుల కొర్రీ

నేరడిగొండ, జూలై 24 : నేరడిగొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు రైతులు రుణం కోసం వెళ్లగా బ్యాంక్ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. పాతబకాయిలు కుటుంబ సభ్యుల పేరిట ఉంటే వారికి రుణం ఇవ్వమని, వాటిని బాకీలో కట్ చేసుకుంటామని చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్దకు చేరుకున్నాడు. రుణమాఫీ అయిన డబ్బులను ఇవ్వకుండా జాప్యం చేస్తున్న బ్యాంక్ అధికారులను నిలదీశారు. బ్యాంకు అధికారుల తీరుతో రైతులు బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోందని అసహనం



బ్యాంకు మేనేజర్‌తో వాగ్వాదం చేస్తున్న లైవ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్

వ్యక్తం చేశారు. రుణమాఫీ డబ్బులను కుటుంబ సభ్యుల పాతబాకీకి ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని రైతులు కూడా మండిపడ్డారు.

## క్రెడిట్ కార్డు నుంచి రూ.38 వేలు మాయం

ఎదులాపురం, జూలై 24 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్ గౌడ్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.38 వేలను పోగొట్టుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రవీణ్ ఫోన్‌కి నాలుగు నెలల కిందట ఒక లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు అతని క్రెడిట్ కార్డు నంబర్ చెప్పాలంటూ పేర్కొనడంతో అమాయకంగా నమ్మి చెప్పేశాడు. వెంటనే నేరగాళ్లు అతని ఖాతా నుంచి రూ.38 వేలు కాజేశారు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడికి సంబంధించిన రూ.25 వేలు హోల్డ్‌లో పెట్టారు.

## నాలుగు వరుసల రహదారులుగా మార్చాలి..

**కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీకి ఎంపీ నగేశ్ వినతి**

ఎదులాపురం, జూలై 24 : ఆదిలాబాద్ జిల్లాలో పలు జాతీయ రహదారులను నాలుగు వరుసల రహదారులుగా మార్చాలని కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్ కోరారు. బుధవారం ఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మహారాష్ట్రలోని రాజురా నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 353(బీ) 110 కిలో మీటర్లు ఉండగా.. మహారాష్ట్రలో 77 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా నిర్మిస్తున్నారని, తెలంగాణలో 33 కిలోమీటర్లు రెండు వరుసలుగా నిర్మాణ పనులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో కూడా నాలుగు వరుసల రోడ్డును నిర్మించాలని కోరారు. మహారాష్ట్రలోని మహోర్ నుంచి చంద్రాపూర్ వరకు సారకాని,



కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ జి.నగేశ్

మాండ్వీ, ఉనికేశ్వర్, నాగ్‌పూర్, కరంజి, అర్లి, ధనోర, భీంపూర్, జందాపూర్ గ్రామాల మీదుగా ఉన్న రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. రెండు రోడ్ల విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ నగేశ్ తెలిపారు.

## ఇదేం రుణమాఫీ

- బాకీ రూ.90 వేలు.. మాఫీ అయింది రూ.1900
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్

తలమడుగు, జూలై 24 : ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సక్రమంగా చేయడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేశ్ మండిపడ్డారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ రైతుకు బ్యాంకులో రూ.90 వేలు బాకీ ఉంటే రూ.1900 మాఫీ జరిగిందని, ఇదీ ముమ్మాటికీ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 18 నుంచి రైతులకు చేస్తున్న రుణమాఫీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రుణమాఫీ జాబితా పట్టుకుని రైతులు బ్యాంకుల చుట్టూ వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కేసీఆర్ చేసిన రూ.లక్ష రుణమాఫీలో ఏ ఒక్కరికి కూడా నష్టం జరగలేదన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతులందరికీ వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# హ్యాపీ బర్త్‌డే కేటీఆర్

- ఘనంగా యువనేత జన్మదిన వేడుకలు
- రక్తదాన శిబిరాలు, రోగులకు పండ్ల పంపిణీ
- మొక్కలు నాటిన కార్యకర్తలు, అభిమానులు



ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకున్నది. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించగా, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. రిమ్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనీషా రిమ్స్‌లో రోగులకు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో పదేండ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని, పరిశ్రమలను స్థాపించి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని నాయకులు పేర్కొన్నారు.

# బడ్జెట్‌పై ఆశలు

- నేడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి భట్టి విక్రమార్క
- జిల్లాలో వరద విపత్తు నిర్వహణకు ప్రత్యేక కేటాయింపులు
- చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రెవెన్యూ డివిజన్‌పై ఆశలు
- పడ్తనపల్లి ఎత్తిపోతల పథకంపై ముందుకు కదిలేనా..
- ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఏర్పాటుపై చొరవ చూపేనా..
- ఆగిన పలు అభివద్ధి పనులకు నిధులపై జిల్లావాసుల ఆశలు




ఆదిలాబాద్/నిర్మల్, జూలై 24(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు ఒక్కపైసా కూడా విదిల్చలేదు. కాగా.. నేడు(గురువారం) రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించే రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉన్న సమస్యలకు పరిష్కా రం చూపిస్తూ నిధులు ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



పెంబి మండలంలో కడెం వాగుపై వరదల కారణంగా కొట్టుకుపోయిన వంతెన

### నిర్మల్ జిల్లావాసులు

ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై తీవ్ర అసంతృప్తి, నిరాశతో ఉన్న జిల్లావాసులు ఈ బడ్జెట్‌పై ఆశలు పెంచుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించగా.. సదర్మాట్ బ్యారేజీ, హైలెవల్ కాలువల పనులు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పథకాలకు కేటాయించిన నిధులను పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి నిధుల కొరతతో ఏ ఒక్క పని కూడా ముందుకు సాగడం లేదు. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి అవసరమయ్యే విద్యుదీకరణ పనులతోపాటు ఇతర పనులకు అవసరమయ్యే రూ.78 కోట్లను ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయలేదు. దీంతో దాదాపుగా నిర్మాణం పూర్తయిన సదర్మాట్ బ్యారేజీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో దాదాపు 18 వేల ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగునీరు అందనున్నది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో కాళేశ్వరం పథకంలో భాగంగా చేపట్టిన హైలెవల్ కాలువలకు సంబంధించి 27,28 ప్యాకేజీ పనుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ రెండు కాలువల నిర్మాణ పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయడమే కాకుండా, కొత్త కాంట్రాక్టు ఏజెన్సీని నియమించి పనులను చేపట్టింది. ఏడు నెలలుగా కాలువల పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆ ఏజెన్సీలు పనులు చేయలేక చేతులెత్తేశాయి. దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ రెండు హైలెవెల్ కాలువలకు నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎస్సారెస్పీ కింద సరస్వతి కాలువ, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద గల కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. ఆయా కాలువల ఆధునీకీకరణ పనులకు బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

### మరమ్మతులకు నోచుకోని రోడ్లు

జిల్లాలోని కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో గతేడాది వచ్చిన వరదల కారణంగా అనేక చోట్ల వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయినప్పటికీ ఇప్పటివరకు వాటి పునర్నిర్మాణం విషయంలో ప్రభుత్వం ఎలాంటి చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల విస్తరణ, మరమ్మతు కోసం రూ.100 కోట్లతో అంచనాలు రూపొందించిన ఆ శాఖ అధికారులు ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏడు నెలలుగా ప్రభుత్వం నుంచి నయాపైసా మంజూరు కాలేదు. అలాగే ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో చెడిపోయిన రోడ్ల మరమ్మతు కోసం రూ.36 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతోపాటు జిల్లాలోని కడెం, పెంబీ, దస్తురాబాద్ మండలాల్లోని దాదాపు 17 గ్రామాలకు ఇప్పటికీ త్రీఫేజ్ కరెంటు సౌకర్యం లేదు. ఈసారి ఎలాగైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించి కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో ఆయా గ్రామాలకు మెరుగైన కరెంటు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.


### విద్య, వైద్య రంగాలపై నిర్లక్ష్యం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పేరిట బడులకు పూర్వ వైభవం కల్పించేందుకు కోట్లాది రూపాయలను విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని పక్కన పెట్టి నయాపైసా విడుదల చేయకుండా అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చి ప్రస్తుతం అభాసుపాలవుతున్నది. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎక్కడ కూడా కనీస మౌలిక సధుపాయాలను కల్పించలేకపోయింది. 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దాదాపు ఏడు ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారులు లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వైద్యాధికారులతోపాటు చాలా చోట్ల వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందే పరిస్థితి కనిపించడం లేదు. పీహెచ్‌సీలతోపాటు ఉప కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మందులు కూడా అందుబాటులో లేవంటున్నారు. కొంతకాలంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిధుల విషయంలో జిల్లాకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని అన్ని వర్గాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### ఆదిలాబాద్ జిల్లావాసులు..

మహారాష్ట్ర సరిహద్దులో గల జైనథ్ మండలంలోని పెన్‌గంగాపై రూ.1,227 కోట్లతో నిర్మిస్తున్న చనాక-కొరాట ప్రాజెక్టుకు సంబంధించి చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగితే పనులు పూర్తయి సాగు భూములకు నీరు అందుతుంది.

- కడెం ప్రాజెక్టు పైన నేరడిగొండ మండలంలోని కుప్టి వద్ద ప్రాజెక్టుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డీపీఆర్ కూడా పూర్తికాగా.. నిధులు మంజూరు చేసే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల కోసం ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు స్పష్టత లేదు. ఇండ్ల మంజూరుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేస్తుంది, తమ సొంతింటి కల నేరవేరుతుందా అని ప్రజలు ఆశగా ఉన్నారు.



చనాక-కొరాట ప్రాజెక్టు

- గిరిజన గ్రామాల ప్రజలు రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. వాగులు పొంగి ప్రవహిస్తుడడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక కేటాయింపులు జరపాలని ప్రజలు కోరుతున్నారు.
- జిల్లాలో గిరిజన జనాభా అధికంగా ఉంది. ఆదివాసీ గూడేలు, తండాల్లో ప్రజలు మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనాభివృద్ధికి పెద్దపీట వేస్తే గిరిజన గ్రామాల అభివృద్ధి జరుగుతుంది. విద్య, వైద్యం, రవాణ, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో వారి అవకాశాలు మెరుగుపడుతాయి.

## అధికారి ఖాతాలోని రూ.96 వేలు మాయం

తాంసి, జూలై 24 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని ఓ ప్రభుత్వ అధికారి బ్యాంక్ ఖాతా నుంచి బుధవారం రూ.96 వేలు మాయం అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆ ప్రభుత్వ అధికారి ఫోన్‌లోకి లింకు వచ్చింది. వాట్సాప్‌లో వచ్చిన లింకుపై క్లిక్ చేయడంతో ఫోన్ సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. దానిని ఓపెన్ చేయగా అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.96 వేలు కాజేశారు. వెంటనే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపినట్లు సమాచారం. మరోవైపు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

## డబుల్ బెడ్రూంలు లబ్ధిదారులకు అందించాలి

భైంసా, జూలై 24 : డబుల్ బెడ్రూంలను వెంటనే లబ్ధిదారులకు అందించాలని న్యూడెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని డబుల్ బెడ్రూంల లబ్ధిదారుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూంల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే కనీస సౌకర్యాలు కల్పించి అందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాము, నహీం, సతీశ్, భాస్కర్ పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూంల వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు